



హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతంకోసం కృషి చేయాలని కేటీఆర్ సూచించారు. –అచ్చంపేట టౌన్/మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 2

# వనపర్తిలో 2 వేల అర్జీలు పెండింగ్

• మండల స్థాయిలో నిలిచిన దరఖాస్తులు

వనపర్తి, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధుపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. మొదటి విడుత పూర్తి కాగా.. రెండో విడుత ప్రశ్నార్థకంలో పడింది. వనపర్తి జిల్లాలో మొదటి విడతలో దాదాపు 199 యూనిట్లు అమలు కాగా.. లబ్ధిదారులు యూనిట్లను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. గేదెలు, కోళ్ల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు ట్రాక్టర్లు, ఆటోలు సైతం కొనుగోలు చేశారు. అయితే కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రెండో విడుతకూ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు రావడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులైనా ఇంకా పథకంలో ఎలాంటి గ్రౌండింగ్ షురూ కాలేదు. మొదటి దశలో లబ్ధిపొంది ఎందరో ఉపాధి పొందుతుండగా.. రెండో విడుతకు మరెందరో గంపెడాశలతో దరఖాస్తు చేసుకున్నారు. కానీ అవి మండల స్థాయిలో ఉన్నాయి. కనీసం జిల్లా కార్యాలయానికి కూడా చేరలేదు. కొత్తకోటకు చెందిన 154, వనపర్తికి చెందిన 720 దరఖాస్తుల సమాచారం మాత్రమే జిల్లా కార్యాలయానికి చేరింది. ఇక మిగిలిన మండలాల్లోని అర్జీల వివరాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల రెండో విడుతలోనూ మంజూరు ఉన్నప్పటికీ కొత్త ప్రభుత్వంలో ఎలాంటి ఉలుకూ పలుకూ లేకపోవడంతో దళిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. జిల్లా స్థాయిలో 874 దరఖాస్తులుంటే, ఒక్కో మండల స్థాయిలో కనీసం 150 దరఖాస్తుల వరకు ఉన్నట్లు సమాచారం.

ఇలా జిల్లాలోని 14 మండలాల్లో కలిపి మొత్తం సుమారు 2 వేల దరఖాస్తుల వరకు రెండో విడుతలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

**పైలట్ ప్రాజెక్టు చారకొండలో..**

| యూనిట్లు | మొత్తం | పంపిణీ |
|---|---|---|
| రవాణా | 950 | 949 |
| దుకాణాలు | 372 | 372 |
| సేవారంగం | 157 | 154 |
| వ్యవసాయం | 229 | 178 |
| మొత్తం | 1,708 | 1,653 |

**కందనూలు జిల్లాలో మొదటి విడుత**

| నియోజకవర్గం | యూనిట్లు |
|---|---|
| అచ్చంపేట | 98 |
| కల్వకుర్తి | 36 |
| కొల్లాపూర్ | 63 |
| నాగర్‌కర్నూల్ | 97 |

## దళితబంధుకు నిధులు కేటాయించాలి



ప్రభుత్వం మారినంత మాత్రాన దళితబంధు పథకం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదు. దళితబంధు వస్తే ఏదైనా వ్యాపారం చేసుకుని ప్రశాంతంగా బతుకుదాం అనుకున్నాం. గిప్పుడు డబ్బులు ఇస్తారా..? ఇవ్వరా..? అనే సందేహాలు నెలకొన్నాయి. అధికారులను అడిగినా సమాచారం ఇవ్వడం లేదు. ప్రభుత్వం నిధులు కేటాయించి దళితబంధు పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

*- లక్కగాళ్ల గోవింద్, వెన్నచేడ్, గండీడ్ మండలం*

## ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు..

దళితబంధు పథకానికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. రెండో విడుతకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. తదుపరి చర్యలు వచ్చిన వెంటనే ఈ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతాం.

*- అనిల్‌కుమార్, ఆర్డీవో, మహబూబ్‌నగర్*



రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ బాలుర జట్టు

# రసవత్తరంగా..

• ముగిసిన హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీ
• బాలుర విభాగంలో ఆదిలాబాద్, బాలికల్లో వరంగల్ విజేత
• రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్లు

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 2 : జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీ ముగిసింది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు మహబూబ్‌నగర్‌పై 20–17 గోల్స్ తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలవగా, మహబూబ్‌నగర్ రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో వరంగల్ జట్టు ఆదిలాబాద్‌పై 9–1 గోల్స్ తేడాతో గెలిచి చాంపియన్‌గా నిలువగా, ఆదిలాబాద్ రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు, బాలుర విభాగంలో వరంగల్ జట్టు మూడోస్థానంలో నిలిచాయి. డీఈవో రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు, మాజీ సెక్రటరీ మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, టోర్నీ ఆర్గనైజర్ జియాఉద్దీన్, పుల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, బాలు, అహ్మద్‌హుస్సేన్, ప్రదీప్, రామ్మోహన్, అనిల్, రాధిక, జ్ఞానేశ్వరి, కోచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమర్‌ఫర్హాత్ తదితరులున్నారు.

# సాయం అందేనా..?

• దళితబంధు మొదటి విడుతలో వందశాతం గ్రౌండింగ్ పూర్తి
• రెండో విడుతలో 3,300 మంది లబ్ధిదారుల ఎంపిక
• కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని లబ్ధిదారుల డిమాండ్

మహబూబ్‌నగర్, జనవరి 2 : దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ సర్కారు దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఒక కుటుంబానికి రూ.10 లక్షలు ఎలాంటి పూచీకత్తు లేకుండా వందశాతం సబ్సిడీ రూపంలో అందించింది. ఈ పథకంతో లబ్ధిపొందిన కుటుంబం తమ జీవితంలో స్థిరపడి ఎవరివైపు చూడకుండా జీవించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడింది. 2014 నాటి కుటుంబ సమగ్ర సర్వేలోని వివరాల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగం తిరిగి సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించింది. గ్రామస్థాయిలో సర్వే జరిపాక లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో ప్రదర్శించిన అనంతరం లబ్ధిదారులను ఎంపికచేసింది. ఈ పథకం దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోని దళితబిడ్డను ఆలోచింపజేసింది. అంతటి పేరుపొందిన ఈ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు గ్రౌండింగ్ చేస్తుందా..? లేదా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు సంబంధించి మొదటి విడుతగా నియోజకవర్గానికి వందమంది చొప్పున 300 మందికి ఒక్కొక్కరికీ రూ.10లక్షల చొప్పున దళితబంధు సాయం అందించింది. వీటిలో లబ్ధిదారులు ట్యాక్సీలు, సూపర్‌మార్కెట్లు, ప్రొక్లైనర్లు, డీసీఎంలు, డెయిరీఫాంలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో రెండో విడుత కింద ప్రతి నియోజకవర్గం నుంచి 1100 మంది లబ్ధిదారులను మొత్తం 3,300 మందిని ఎంపిక చేసింది. ఎన్నికలకు ముందు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే దళితబంధు డబ్బులు మీ ఖాతాలలో జమ అవుతాయని అధికారులు సైతం చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో దళితబంధు పథకం ప్రశ్నార్థకంగా మారింది. రెండో విడుత సాయం అందుతుందా..? కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకానికి నిధులు గ్రౌండింగ్ చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

దళితబంధు కింద పంపిణీ చేసిన ట్రాక్టర్లు (ఫైల్)



# దళితబంధుపై నీలినీడలు!

• పథకానికి చే..యూత దక్కేనా?
• ప్రశ్నార్థకంగా రెండో విడుత ఎంపిక
• ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ
• కోడ్‌తో ఆగిన రూ.10 లక్షల సాయం
• మండల స్థాయిలో నిలిచిన ప్రక్రియ
• కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద పెండింగ్
• పథకం గ్రౌండింగ్ కోసం దళితుల ఆశ

## కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు ఇవ్వాలి



తొలివిడుత దళితబంధుతో రూ.10 లక్షలు వచ్చిన వారు మంచిగా బతుకుతున్నరు. రెండో విడుతలో అన్ని సర్టిఫికెట్లు ఇచ్చి దరఖాస్తు చేసుకున్న. ఎన్నికల కోడ్ వచ్చిందని ఆపేసిండ్రు. ఇప్పుడు ప్రభుత్వం మారిందని పథకం ఇస్తలేరు. జిల్లా అధికారులను అడిగితే మాకేం తెల్వదు అంటున్నరు. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఇన్‌స్ట్రక్షన్స్ రాలేదని చెబుతుండ్రు. రూ.15 లక్షల సాయం దళితబంధులా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిండ్రు. రైతుబంధు పథకం పాత మాదిరిగానే ఇచ్చారు. ఆ విధంగా దళితబంధును రెండో విడుత కూడా అమలు చేయాలి. మా దళితులపై ప్రేమను నిరూపించుకోవాలి.

*- కొత్త గంగాధర్, నాగర్‌కర్నూల్*

***దళితబంధు.. సమాజంలో అట్టడుగు వర్గాలైన దళితులకు ఆర్థిక సాయం అందించి అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన బృహత్తర పథకం. ఇందులో ఉమ్మడి పాలమూరులో వేలాది మంది దళితులు లబ్ధి పొంది వివిధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాంటి పథకం అమలుపై కాంగ్రెస్ సర్కారు హయాంలో నీలినీడలు కమ్ముకున్నాయి. ఆర్థిక స్థిరత్వం నింపిన పథకంలో రెండో విడుత ఎంపిక ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించినా.. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ నిలిచిపోయింది. తర్వాత మారిన రేవంత్ ప్రభుత్వం విధాన పర నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తులు మండల స్థాయిలోనే ఆగిపోయి కనీసం జిల్లా కార్యాలయానికి కూడా చేరలేదు. గ్రౌండింగ్ నిలిచిపోవడంతో దళిత వర్గాల్లో నిరాశ నెలకొన్నది.***

*- నాగర్‌కర్నూల్/వనపర్తి (నమస్తే తెలంగాణ) / మహబూబ్‌నగర్/నారాయణపేట, జనవరి 2*

నాగర్‌కర్నూల్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : సమాజం అభివృద్ధి చెందాలంటే అట్టడుగున ఉన్న దళితులు ఆర్థికంగా ఎదగడం కూడా ప్రధానమని నాటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించి 2021 ఆగస్టు 5న దళితబంధును లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక్కో దళిత కుటుంబానికి ఎలాంటి బ్యాంక్ లింకేజీ లేకుండా పూర్తిగా వంద శాతం సబ్సిడీతో రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించింది. దళితులు కోరుకున్న యూనిట్లతో ఉపాధి పొందేలా కేసీఆర్ ప్రభుత్వం స్వేచ్ఛ కల్పించింది.

***పైలట్ ప్రాజెక్టుగా చారకొండ***

రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఒకటిగా తొలుత నాగర్‌కర్నూల్ జిల్లాలోని చారకొండ మండలం ఎంపికైంది. ఈ మండలంలోని 17 పంచాయతీల్లో సర్వే చేపట్టిన అధికారులు 1,708 మందిని పథకానికి అర్హులుగా గుర్తించారు. ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేశారు. వంద శాతం సబ్సిడీతో దళితులు కోరిన పథకాలకు రుణాలను పారదర్శకంగా అందజేశారు. ఈ రుణాలతో అత్యధికంగా రవాణా రంగం ద్వారానే ఉపాధి పొందేందుకు ప్రాధాన్యతనిచ్చారు. ఇందులో కార్లు, జేసీబీలు, డీసీఎం, ట్రాక్టర్లు లాంటి వాహనాలను కొనుగోలు చేశారు. అలాగే చికెన్ దుకాణాలు, సెంట్రింగ్, టెంట్ హౌస్, డీజే సౌండ్‌లాంటి పలు వ్యాపారాల్లో దళితులు స్థిరపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లాంటి ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌లాంటి అధికారుల సమన్వయంతో పారదర్శకంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ రుణాల పంపిణీ చేశారు. ఇలా మండలంలో దాదాపు దళితులందరూ ఈ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీ రుణాలను పొందడం గమనార్హం. మండలంలోని మొత్తం 1,708 యూనిట్లకుగానూ ఇప్పటి వరకు 1,627 మందికి (90 శాతం) రూ.10 లక్షల చొప్పున రుణాల పంపిణీ విజయవంతమైంది. కాగా తొలి విడుతలో ప్రతి నియోజకవర్గానికి 100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి రూ.10 లక్షల చొప్పున ఒక్కో నియోజకవర్గంలో రూ.10 కోట్ల ఆర్థిక సాయం అందించారు.

***రెండో విడుతలో 1100 మందికి..***

రెండో విడుతలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 1,100 మంది లబ్ధిదారులకు సాయం అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం దేశంలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా బడ్జెట్‌లో నాటి సర్కారు రూ.17 వేల కోట్లను కేటాయించడం విశేషం. దీంతో గత అక్టోబర్‌లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 1,100 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో సాయం మంజూరు కాలేదు. ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. సాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటపై దళితులు ఆశలు పెట్టుకొన్నారు. రైతుభరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.15 వేలు సాయం అందిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాదిరే తాజాగా ఎకరాకు రూ.5 వేల చొప్పున అందించింది. ఇదే క్రమంలో దళితబంధు పథకానికి కూడా చే..యూత ఇవ్వాల్సిందిగా దళితుల నుంచి అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తొలివిడుత పథకంతో లబ్ధిపొందిన దళితులకు ఆర్థిక భరోసా కల్పించగా.. రెండో విడుతపై కాంగ్రెస్ నిర్ణయం కోసం దళితులు ఎదురుచూస్తున్నారు.

## మొదటిది సరే.. రెండో విడుత మాటేమిటి?

• దళితబంధుపై నోరు మెదపని అధికారులు

నారాయణపేట, జనవరి 2 : జిల్లాలో మొదటి విడుత దళితబంధు సాయం అందినప్పటికీ.. రెండో విడుత సాయంపై అధికారులు నోరు మెదపడం లేదు. కేసీఆర్ సర్కారు హయాంలో నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు వంద యూనిట్ల చొప్పున జిల్లాకు 200 యూనిట్లు మంజూరు చేశారు. వీటికి వందశాతం నిధులు గ్రౌండింగ్ చేశారు. మొదటి విడుత సాయం అందుకున్న వారు టెంట్ హౌస్, కిరాణా దుకాణాలు, ట్రాక్టర్లు, డోజర్లు, జేసీబీలు, కార్లు కొనుగోలు చేసి వాటి ద్వారా ఉపాధి పొందుతూ వస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండో విడుతగా ప్రతి నియోజకవర్గానికి 1,100 యూనిట్ల చొప్పున పేట, మక్తల్ నియోజకవర్గాలకు కలిపి 2,200 యూనిట్లు మంజూరయ్యాయి. గ్రామాల వారీగా అధికారులు దళితబంధు దరఖాస్తుల విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తుంది. ఇక అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ అందజేయాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రెండో విడుత నిలిచిపోయింది. ఈ విషయంపై సంబంధిత జిల్లా అధికారి హరినాథ్‌రెడ్డిని వివరణ కోరగా.. రెండో విడుతకు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు. దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగిస్తారా లేదా అనే విషయంపై దళిత కుటుంబాలు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

## దళితబంధు పేదలకు వరం



కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు ఎంతో మంది పేదలకు వరమైంది. నేను కూడా దరఖాస్తు పెట్టుకుంటే మంజూరైనట్లు జాబితాలో పేరొచ్చింది. ఇక ఖాతాలో డబ్బులు పడతాయనుకున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ఎన్నికలు ముగిసి నెల రోజులవుతున్నది. దళితబంధు డబ్బులు మంజూరైతే కొత్త కారు కొనుగోలు చేసి అద్దెకు తిప్పుతూ వచ్చే ఆదాయంతో జీవనం కొనసాగిద్దామని అనుకున్నాను. కానీ ప్రస్తుత ప్రభుత్వం స్పందించడం లేదు. ఇప్పటికైనా పథకాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి. దళితబంధు పథకం దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. అందుకే పథకాన్ని నిలిపి వేయొద్దు. వెంటనే నిధులు మంజూరి చేసి ఆదుకోవాలి.

*- జి.వెంకటన్న, పెబ్బేరు*

## ఇంకా గ్రౌండింగ్ కాలేదు



దళితబంధు తొలి విడుతలో జిల్లాలో 301 మందికి, పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చారకొండలో దాదాపుగా 1,650 మందికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. రెండో విడుతలో ప్రభుత్వం నుంచి ఎలాంటి గ్రౌండింగ్ కాలేదు. నియోజకవర్గంలో 1,100 మందిని లబ్ధిదారులుగా ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లో గతంలో ఉన్న ఎమ్మెల్యేల ద్వారా దళితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో పథకం అమలుపై అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. తొలివిడుతలో ఎంపికైన లబ్ధిదారులు వివిధ రకాల యూనిట్లతో ఉపాధి పొందుతున్నారు.

*- రాంలాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, నాగర్‌కర్నూల్*

## కేసీఆరే దళితులను పట్టించుకున్నారు..



కేసీఆర్ సర్కారు తప్పా గతంలో దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. దళితుల కుటుంబాల్లో ఆశాజ్యోతిగా నిలిపిన మహనీయుడు కేసీఆర్. దేశంలోనే ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకాన్ని మన రాష్ట్రంలో అమలు పరిచారు. ఈ పథకం ద్వారా యువకులు సాయం పొంది పాడి పశువులు, కోళ్లు, వివిధ యంత్ర పరికరాలు, షాపులు పెట్టుకొని జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఎన్నికల ముందు ఎంతో మంది ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక బ్రేక్ పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం అమలుకు నోచుకోకపోవడంతో దళితుల ఆశలు నిరాశగా మారాయి. దళితుల అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం అమలుకాకపోతే రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుంది.

*- శివప్రసాద్, రామకృష్ణాపురం, కొత్తకోట మండలం*

## దళితబంధును కొనసాగించాలి



ప్రభుత్వాలు మారినా సంక్షేమ పథకాలను కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని పూర్తి స్థాయిలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలి. ఎన్నో ఏండ్లుగా ఫొటోగ్రాఫర్ వృత్తిలో కొనసాగుతున్నాను. దళితబంధు పథకానికి అన్ని విధాలా అర్హుడనని గుర్తించి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నాపేరును లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. రేపోమాపో డబ్బులు వస్తాయనుకున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో నా ఆశలు అడియాశలయ్యాయి. దళితబంధు డబ్బులు వచ్చింటే సొంతంగా ఫొటో స్టూడియో పెట్టుకొని సమాజంలో గౌరవంగా బతకాలని అనుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అలాగే కొనసాగించి మాలాంటి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి.

*- రాములు, ఫొటోగ్రాఫర్, తిర్మలాయపల్లి, మదనాపురం మండలం*

## అప్పులు తీరి.. ఆనందంగా బతుకుతున్నా



దళితబంధు పథకం నా కుటుంబాన్ని ఆదుకున్నది. మాది నిరుపేద కుటుంబం. ఎకరాల భూమి లేదు. భార్యాపిల్లలను పోషించుకునేందుకు డబ్బులు లేవు. ప్రైవేట్‌గా డ్రైవింగ్‌కు పోతూనే చిన్నచిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని నడిపాను.. దళితబంధు పథకంలో మర్రి జనార్దన్‌రెడ్డి సారు నా పేరు పెట్టారు. నాకు రూ.10లక్షలు వచ్చినయ్. ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా ఈ సాయం అందింది. ఇంతకు ముందు ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.50 వేల రుణం కోసం ఎందరినో కలిసినా లాభం లేకపోయింది. ఎంపీడీవో నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి వరకు దరఖాస్తు చేసుకున్నా.. కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఒక్క రూపాయి రాలేదు. ఈ పథకం కోసం రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు ఇచ్చిన. దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజులకే నాకు రూ.10 లక్షలు ఇచ్చిండ్రు. ఈ మొత్తంతో స్విఫ్ట్ కారు కొనుక్కొని సొంతంగా నడుపుతున్నా.. నెలలో 20 రోజులైనా పని దొరుకుతుంది. మా కుటుంబానికి అప్పులు లేకుండా హాయిగా బతుకుతున్నాం.

*- సామ మహేశ్, బిజినేపల్లి మండలం*







మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బంకుల్లో బారులుదీరిన ప్రజలు, జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద ఉన్న పెట్రోల్‌బంకులో దర్శనమిస్తున్న నోస్టాక్‌బోర్డు

# బంకుల్లో బారులు

• పెట్రోల్, డీజిల్ కోసం పోటెత్తిన వాహనదారులు
• పలుచోట్ల నోస్టాక్ బోర్డుల దర్శనం

మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్/అచ్చంపేట, జనవరి 2 : మోటర్ వాహన సవరణ చట్టం తీసుకురావడాన్ని నిరసిస్తూ ఆయిల్ ట్యాంకర్ల నిర్వాహకులు బుధవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ దొరకదన్న విషయాన్ని తెలుసుకున్న వాహనదారులు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా బంకుల వద్ద బారులుదీరారు. పలుచోట్ల నోస్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. లారీలు, డీసీఎంలు, ఆటోలు, కార్లు క్యూలో గంటల తరబడి నిరీక్షించారు. అయితే, సమ్మె విరమించారని, వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బంక్‌ల యజమానులు తెలిపారు.